నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం జూన్ 30, 2024 www.navatelangana.com

గురుకులాల్లో ఖాళీ సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగిలిన ఖాళీల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసు కోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ నళిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగిలిన ఖాళీల ప్రవేశం కొరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27 నుంచి జూలై 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఆయా పాఠశాలలకు బదిలీ కోరుకునే వారు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 27 నుంచి జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కబ్జాకు గురవుతున్న హైవే పాతరోడ్లు

నవతెలంగాణ-సదాశివనగర్



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల వద్ద గతంలోని ఏడవ జాతీయ రహదారి పాత రోడ్లు కబ్జాలకు గురవుతున్నాయి. ఆ స్థలాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పలువురు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నట్టు సమాచారం. మండలంలోని పద్మాజివాడి, కల్వరాల్, సదాశీవనగర్ శివారులో గల జాతీయ రహదారి స్థలాలు ఉన్నాయి. ఆ స్థలాల విలువ కోట్ల రూపాయలు పలుకుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కబ్జాకు గురికాకుండా చూడలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయ దిగ్గజం

డీఎస్ అస్తమయం

- గుండెపోటుతో తెల్లవారుజామున కన్నుమూసిన మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్
- ఎన్ఎస్‌యూఐ కార్యకర్త నుంచి పీసీసీ ప్రెసిడెంట్ స్థాయి వరకు ప్రస్థానం
- నివాళి అర్పించిన పలువురు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్/సిటీ

మాజీ మంత్రి, పీసీసీ మాజీ చీఫ్, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్(75) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో ఎన్ఎస్‌యూఐలో సామాన్య కార్యకర్తగా తన ప్రస్థానం ప్రారంభించిన డీఎస్.. తదనంతరం ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా, రాజ్యసభ సభ్యుడిగా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. కాగా ఆయన మృతిపట్ల సీఎంతో పాటు పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు. నేడు నిజామాబాద్‌లో అధికార లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో 1948 సెప్టెంబర్ 27వ తేదీనా జన్మించిన డీఎస్.. నిజాంకాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. డిగ్రీ చదువుతున్న సమయంలో ఎన్ఎస్‌యూఐలో చేరి సామాన్య కార్యకర్తగా పని చేసిన ఆయన.. రాజకీయాలపై ఆసక్తితో కాంగ్రెస్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ఎమ్మెల్యే నుంచి మంత్రి, పీసీపీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.



రాజకీయాలపై చెరగని ముద్ర..

నిజాం కళాశాలలో డిగ్రీ చదివే రోజుల్లో డీఎస్ విద్యార్థి నాయకుడిగా ఎన్ఎస్‌యూఐలో పనిచేశారు. అనంతరం ఆర్‌బీఐలో ఉద్యోగం చేస్తుండగా.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పిలుపు మేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. యువజన కాంగ్రెస్‌లో చేరి అర్గుల్ రాజారాం శిష్యుడిగా తనకంటూ ప్రత్యేక పేరు సంపాదించుకున్నారు. తొలుత 1981లో ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోయారు. 1983లో నిజామాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలిచి అపజయం పాలయ్యారు. అనంతరం 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సత్యనారాయణపై గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐఅండ్ పీఆర్ శాఖ మంత్రిగా పని చేశారు. 1994లో ఓడిపోగా.. 1999లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తదనంతరం 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఎమ్మెల్యేగా గెలుపొంది ఉన్నత విద్యాశాఖ, అర్బన్‌ల్యాండ్ సీలింగ్ శాఖల మంత్రిగా పని చేశారు. 2004, 2009 ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా పని చేశారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కీలకంగా పని చేశారు. ఆ సమయంలో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడంతో డీఎస్ ప్రత్యేక కృషి చేసి కాంగ్రెస్ అధికారంలో వచ్చేందుకు తన వంత పాత్ర పోషించారు. కాగా 2009లో అర్బన్ నుంచి, 2014లో రూరల్ నుంచి బరిలో దిగి ఓడిపోయారు. 2013 నుంచి 2015 వరకు శాసనమండలి సభ్యునిగా సైతం పని చేశారు. తెలంగాణ తొలి శాసనమండలి ప్రతిపక్ష నేతగా డీఎస్ కొనసాగారు.



తిరిగి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో వచ్చిన కాంగ్రెస్ నాయకులు..

అధిష్టానానికి వీరవిధేయుడిగా..

కాంగ్రెస్ అధిష్టానానికి వీర విధేయుడిగా డీఎస్ పని చేశారు. 2009లో తెలంగాణ ఉద్యమం జోరందుకున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. డీఎస్ పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఆ సమయంలో అటు అధిష్టానంతో పాటు ఇటు ఎమ్మెల్యేలను సమన్వయం చేస్తూ కీలకంగా పని చేశారు.


తిరిగి సొంత గూటికి..

తదనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎస్.. 2022లో తిరిగి సొంత గూడు కాంగ్రెస్ లోకి చేరారు. రాజ్యసభ సభ్యునిగా ఉన్న సమయం నుంచి క్రీయాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇంటికే పరిమితమైయ్యారు.

అందరూ అభిమానించే నేత..
డీఎస్ : ధర్మపురి సంజయ్

డి.శ్రీనివాస్ అస్తమ యంతో రాజకీయంలో ఒక శకం ముగిసిందని ఆయన పెద్దకొడుకు సంజయ్ అన్నారు. అందరూ అభిమానించే నేత డీఎస్ అని గుర్తుచేశారు. పేదవారికి అండగా నిలిచి.. ఆపద ఉన్న సమయంలో ఆదుకుంటూ వారి సమస్యలు తీర్చారని కొనియాడారు. నేడు నగరంలోని బైపాస్‌రోడ్డులో తమ సొంత భూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభిమానుల సందర్శనార్థం.. డీఎస్ పార్థీవదేహం నగరంలోని ప్రగతినగరలో గల సొంత నివాసంలో ఉంచారు.

తండ్రి, గురువూ.. అన్నీ నాన్నే : ఎంపీ అరవింద్



'అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. ఐ విల్ మిస్ యూ డాడీ. నా తండ్రి, గురువు అన్నీ నాన్నే. ఎదురొడ్డి పోరాడు.. భయప డకు అని నేర్పింది మా నాన్నే. ప్రజలను ప్రేమించు.. ప్రజల కోసమే జీవించూ అని చెప్పింది మా నాన్నే. నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు.. నాలోనే ఉంటావు' అని ఆయన చిన్న కొడుకు ఎంపీ అరవింద్ భావోద్వేగానికి గురై.. తన తండ్రితో కలిసి దిగన ఫొటోను సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

తృటిలో చేజారిన పెద్దపదవి..

2009లో డీ.శ్రీనివాస్ పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో అకాలమరణం చెందారు. ఆ సమయంలో డీఎస్ ఎమ్మెల్యేగా గెలుపొంది లేకపోవడంతో రోశయ్యకు అపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగారు. తదనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో పలువురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. 2010లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ సైతం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అర్బన్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో యెండల లక్ష్మీనారాయణపై డీఎస్ పోటీ చేశారు. ఆ సమయంలో డీఎస్ గెలిస్తే పెద్ద పదవి వరించనున్నట్టు ప్రచారం జరిగింది. కానీ తెలంగాణ సెంటిమెంట్‌తో రాజీనామా చేసిన యెండల లక్ష్మీనారాయణనే ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారు. ఆ సమయంలో డీఎస్ గెలుపొందితే సీఎంగా అయ్యే అవకాశాలున్నట్టు ప్రచారం జరిగింది. తృటిలో చేజారినట్టయింది.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

2015లో ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియగా.. కాంగ్రెస్ అధిష్టానం మరోసారి అవకాశం కల్పించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైయ్యారు. అదే సమయంలో సీఎంగా ఉన్న కేసీఆర్ ఆహ్వానం మేరకు గులాబి కండుగా కప్పుకొని టీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర రాష్ట్ర వ్యవహారాల సలహాదారులుగా పనిచేశారు. అనంతరం టీఆర్ఎస్ నుంచి 2016-22వరకు రాజ్యసభ సభ్యులుగా కొనసాగారు.



కుటుంబ నేపథ్యం..

సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు డీ.శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానం సాగింది. డీఎస్‌కు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కొడుకులు ధర్మపురి సంజయ్, ధర్మపురి అరవింద్ ఉన్నారు. సంజయ్ నిజామాబాద్‌కు తొలి మేయర్‌గా పని చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. రెండో కుమారుడు అరవింద్ బీజేపీలో చేరి 2019, 2024 రెండు పర్యాయాలు నిజామాబాద్ ఎంపీగా గెలుపొందారు.

పలువురి నివాళి.. నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

డీఎస్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితర ప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్త, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు. కాగా ఆయన పార్థీవ దేహాన్ని శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్‌లో గల తన స్వగృహానికి ఆయన అభిమానుల సందర్శనార్థం తరలించారు. రేపు అధికార లాంఛనాలతో బైపాస్‌రోడ్డులోని వారి స్వంత భూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



సోనియాగాంధీ, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ధర్మపురి శ్రీనివాస్

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని సీపీఐ(ఎం) కా మారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలంపాట ను వేస్తున్నదని, సింగరేణి కంపెనీ ప్రైవేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలనే స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమ ర్శించారు. వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వా లి, కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను వారికి ఇవ్వడం సరైంది కాదన్నారు. బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రా రంభించడం సిగ్గుచేటని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థ లకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముంటుందని, క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తు ందన్నారు. నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు.

గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రవేటు సంస్థలకు కట్టబెట్టారని ప్రభుత్వ రంగం లో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరు గవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శిం చారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు మరో 26,000 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుం దన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడుగంటి పోయాయని కొత్త బ్లాకులో తవ్వకాలు ప్రారంభించా లని, కేంద్ర ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్నదని విమర్శించారు. శ్రావణపల్లి బ్లాకు, మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చూడతమని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.

డయల్ 100కు ఫిర్యాదు రాగానే వెంటనే స్పందించాలి

- జిల్లా అడిషనల్ ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

ఎవరైనా బాధితులు డయల్ 100కు ఫోన్ చేస ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించాలని జిల్లా అడిషనల్ ఎస్పి (అడ్మిన్) కే. నరసింహారెడ్డి సూచించారు. శిక్షణలో బాగంగా జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్లల్లో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్, పెట్రోకారు సిబ్బందికి శనివారం శిక్షణను ఇచ్చారు. 100కు ఫిర్యాదు రావడంతో క్షణాల్లో స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్ , పెట్రోకారు సిబ్బందిపై వుందని వచ్చిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేసి స్టేషన్ అధికారికి పూర్తి నివేదిక అందజేయడం ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రజలకు పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి

బ్లూకోల్ట్స్, పెట్రోకారు సిబ్బంది తమ పరిధిలో ముందస్తూ సమాచారాన్ని సేకరించాల్సి వుంటుందని, ఇలాంటి ముందస్తూ సమాచారం అధికారులకు చేరవేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతలను పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్బి ఇన్స్‌పెక్టర్ జార్జ్, టౌన్ ఇన్స్పెక్టర్ చంద్ర శేకర్ రెడ్డి, బిచ్కుంద ఇన్స్పెక్టర్ నరేష్, పిసిఆర్ ఇన్స్పెక్టర్, బ్లూకోల్ట్స్ పెట్రోకారు సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనంతో..

తెరుచుకున్న అదనపు గదులు

- ఏకరూప దుస్తులు సైతం పంపిణీ చేయాలని ఎంఈవో ఆదేశం

నవతెలంగాణ-ధర్పల్లి

ధర్పల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 'అదనపు గదులున్నా.. ఆరుబయటే చదువులు' పేరిట నవతెలంగాణలో ప్రచురితమైన కథనంతో విద్యాశాఖాధికారులు స్పందించారు. జిల్లా అధికారులు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేయడంతో శనివారం ఆయన పాఠశాలను సందర్శించారు. కొత్తగా నిర్మించిన అదనపు గదుల్లోనే విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. అదే విధంగా మధ్యాహ్న భోజన సౌకర్యార్థం నిర్మించిన భవనంలో భోజనాలు అందించే ఏర్పాటుతోపాటు ,విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని ఆదేశించినట్టు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి నవతెలంగాణకు తెలిపారు.



నూతన తరగతి గదుల్లో కూర్చున్న విద్యార్థులు

కాగా నవతెలంగాణ కథనం పట్ల స్పందించిన గ్రామపెద్దలు పాఠశాలకు చేరుకొని జరిగిన హెచ్ఎం ఘనజ్యోతి తీరు పట్ల పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను కలిసి ఆరా తీశారు. 26 మంది ఉపాధ్యాయులు వెల్లడించినట్లు తెలిసింది. హెచ్ఎం ఘనజ్యోతి ఆగడాలు తాము భరించలేమని, ఆమె ఇక్కడ విధులు నిర్వహిస్తే తమకు మరెక్కడికైనా బదిలీ చేయాలని, ఆమెతో కలిసి ఇక్కడ తాము ఇమడలేక పోతున్నామని వారి గోడు గ్రామస్థులకు తెలిపినట్లు తెలిసింది.

బియ్యం దొంగలించడం, గుడ్లు తీసుకెళ్లడం,ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం, ఉర్దూ మీడియం ఉపాధ్యాయునిపైకి ఆమె భర్త చిందులు వేయడం, భార్య స్థానంలో భర్త పెత్తనం, సహోద్యోగులు ఆదమరిచి గుడ్ మార్నింగ్ చెప్పకపోతే వారిపై కక్ష పూరితంగా వ్యవహరించడం లాంటివి విద్యాశాఖాధికారులతో పాటు గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. బోనఫైడ్ కొరకు వచ్చిన విద్యార్థుల నుండి డబ్బులు తీసుకోవడం,స్టాఫ్ కు పాఠశాలలో టి తాగనివ్వకపోవడం అనే ఘోర సంఘటనలు తాము ఎక్కడ చూడలేదని వాపోయినట్లు తెలిసింది. చేసేదంతా చేసి విచారణ సమయంలో ఆరోగ్యం బాగాలేదని బుకాయిస్తూ పాఠశాలకు సెలవు పెట్టడం ఏంటని ప్రశ్నించినట్టు సమాచారం.

దీంతో స్పందించిన గ్రామపెద్దలు తమ గ్రామ పాఠశాలకు చెడ్డపేరు వస్తే సహించేది లేదని, ఉపాధ్యాయులు వస్తుంటారు పోతుంటారు ,మాగ్రా పరువు ప్రతిష్టతోపాటు, విద్యార్థుల భవిష్యత్తు తమకు ముఖ్యమని, ఎమ్మెల్యే దృష్టికి, ఉన్నతాధికారుల తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ ఎఫెక్ట్

కావాలనే కక్ష సాధిస్తున్నారు
హెచ్ఎం ఘనజ్యోతి రాణి

నవతెలంగాణలో ప్రచురణకు వచ్చిన కథనానికి స్పందించిన హెచ్ఎం గాదె ఘనజ్యోతి రాణి.. తాను ఏ తప్పూ చేయలేదని తెలిపారు. నవతెలంగాణ విలేకరితో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాల సమయంలో విద్యార్థులకు సమయానికి క్లాసులు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించానని, ఎప్పుడు పడితే అప్పుడు టీ తెప్పించుకొని తాగొద్దని చెప్పానని, విద్యపై దృష్ట సాధించాలని చెప్పుతున్నందుకు అందరు కలిసి తనపై నిందలు వేస్తున్నట్టు వాపోయారు. అసలే తనకు ఆరోగ్యం బాగుండటం లేదని, అందుకే తన భర్తను వెంట పాఠశాలకు తీసుకొస్తున్నట్టు తెలిపారు. పాఠశాల సమయంలో తోటి మహిళా సహోద్యోగులు ఉంటారని గ్రహించి తన భర్తను పాఠశాలలోని రానీయకుండా బయటే ఉంచుతానని వెల్లడించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం జూన్ 30, 2024 www.navatelangana.com

ఆర్థిక సహాయం అందజేత



బాధితులను పరామర్శిస్తున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు లోచారం వినేష్ భార్యకు ఇటీవల శస్త్రచికిత్స కావడంతో శనివారం తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు జావీద్, తౌటు గంగాధర్, యూనుస్, ఇమ్రాన్ ఖాన్, షేరు, జహీర్ తదితరులున్నారు.

గల్ఫ్‌దేశంలో సిర్పూర్ వాసి మృతి



బాలరాజ్ (ఫైల్)

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన చెన్నూరి బాల్‌రాజ్ బతుకు దెరువుకోసం బహరేన్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తూ చనిపోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చే ఆర్థిక స్తోమత వారికి లేనందున మృతుడి కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతిరెడ్డికి తెలియజేశారు. ఆయన వెంటనే ప్రభుత్వ ముఖ్యకార్యదర్శితో మాట్లాడి ప్రభుత్వ ఖర్చుతో మృతదేహాన్ని తేవటానికి ఏర్పాట్లు చేయించారు. శనివారం సాయంత్రం మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్వస్థలానికి తీసుకువచ్చి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాక మృతదేహాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి సొంత గ్రామానికి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించే విధంగా కూడా ఆయన ఏర్పాటు చేశారు.

నీరు నిల్వ ఉండొద్దు

- అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్
- బోధన్ పట్టణంలోని పలు కాలనీలు పరిశీలన

నవతెలంగాణ-బోధన్

వర్షాకాలం ప్రారంభమైనందున ఎక్కడా కూడా నీరు నిల్వ ఉండొద్దని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు పెరగకుండా మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. శనివారం బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణను కలిసి సీజనల్ వ్యాధులు నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి

అనంతరం పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలో పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న నీటిని పనికిరాని వస్తువులలో నిలిచిన నీటిని పరిశీలించారు. ఆయా కుటుంబాలకు దోమలు పెరగడంపై, వ్యాధులు ప్రబలడంపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తప్పనిసరిగా చేపట్ట వలసిన చర్యలను మునిసి పాలిటీ అధికారులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులపై, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమలు పెరగకుండా ఉంటుందని అన్నారు. అలాగే ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా పనికిరాని వస్తువులలో మురికినీరు, వర్షపునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలితే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తక్షణమే చికిత్స తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లార్వాలను పరిశీలించి వాటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఉప వైద్యాధికారి డా.విద్య, సూపర్‌వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలున్నారు.

బాడీ ఫ్రీజర్ వితరణ



ఫ్రీజర్‌ను వితరణ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బాల్కొండ

కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ చైర్మన్ జ్ఞాన సాగర్‌రెడ్డి లయన్స్ క్లబ్ బాల్కొండకు శీతలీకరణ శవపేటిక ఫ్రీజర్‌ను వితరణ చేశారు. శనివారం కిసాన్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులకు ఆయన ఫ్రీజర్‌ను అందజేశారు. ఆయన తండ్రి నల్ల నారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా బాల్కొండ మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫ్రీజర్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉన్నవారు తమ ఆప్తుల అంత్యక్రియలకు వచ్చేవరకు స్థానికులు శవపేటిక ఫ్రీజర్‌ను వాడుకోవాలని ఆయన కోరారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, స్థానిక బాధ్యులు పోతుప్రసాద్, మల్లేష్, నరసయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పొతంగల్

మండల కేంద్రంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనదారులను హెచ్చరించారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల అండ్ కళాశాల నిజామాబాద్ బాలికలు - 1 లో ఔట్‌సోర్సింగ్ విధానంలో బోధించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అనుభవమున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ -01 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.రాజశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌కు పిజిడిసిఎం డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. అధ్యాపకులు ఇంగ్లీష్, మ్యాథ్స్, జువాలజీ, కెమిస్ట్రీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడుయేషన్, బీఈడి కలిగి ఉండాలని పేర్కొన్నార. పైన తెలిపిన పోస్టులకు అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు జూలై 3లోపు నందిగుట్ట నాగారంలోని అసద్ బాబానగర్ ప్రాంతంలో కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలని వివరించారు. వివరాలకు 8328618748, 9494958085 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాఠశాల బలోపేతానికి గ్రామస్తుల ఐక్యత

- ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని నిర్ణయం
- హర్షం వ్యక్తం చేసిన అధికారులు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ధర్పల్లి

తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి గ్రామస్థులంతా ఏకమయ్యారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా శనివారం మండలంలోని చల్లగర్గ గ్రామస్తులు అన్నీ కుల సంఘాలు, గ్రామాభివృద్ధి, గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి, మండల తహసీల్దార్‌లను ఆహ్వానించి తీర్మానం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. తమ గ్రామంలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన ప్రభుత్వ బడి ఉండగా, తాము ఇతర ప్రయివేట్ పాఠశాలలకు తమ పిల్లలకు పంపకుండా చూస్తామని తెలిపారు. గ్రామస్థులు తీసుకున్న ఇంత మంచి నిర్ణయం పట్ల మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మాలతీ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీఎస్ సేవలు మరువలేనివి



ఆర్మూర్ : డి.శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వినయ్‌రెడ్డి



మోపాల్ : భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముప్ప గంగారెడ్డి

- నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : కాంగ్రెస్ పార్టీకి డీ.శ్రీనివాస్ చేసిన సేవలు మర్చిపోలేనివని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం డి.శ్రీనివాస్ మృతి సందర్భంగా ఆయన భౌతికకానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి పీసీసీ అధ్యక్షులుగా వ్యవహరించిన డి.శ్రీనివాస్ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. పీసీసి అధ్యక్షులుగా ఉండి కూడా ముఖ్యమంత్రి పదవిని ఆశించకుండా ఇతర నాయకులకు అవకాశం ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతి జిల్లాలో తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన పేర్కొన్నారు.

నివాళులర్పించిన కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి..

మోపాల్ : తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతిచెందడంతో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డి.శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డి శ్రీనివాస్ మృతి ఆయన కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్రానికి తీరనిలోటని అన్నారు. ఎంతోమంది నాయకులు వస్తుంటారు.. పోతుంటారని.. కానీ డి.శ్రీనివాస్ మాత్రం ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయే మహనీయుడని ఆయన కొనియాడారు.

ఆర్మూర్ : మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి, మిత్రులు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిఆర్‌జేఎన్ వెంకట్ తదితరులు శనివారం సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డి.శ్రీనివాస్‌కు నివాళి

జక్రాన్‌పల్లి: మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షులు డి.శ్రీనివాస్ మరణించడంతో వారి భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో దళిత గిరిజన బహుజన సంఘాల నాయకులు నివాళులర్పించినట్టు జిల్లా మాల మహానాడు జనరల్ సెక్రెటరీ నాయుడు రాజు తెలిపారు. దళిత, గిరిజన, బహుజన, సంఘాలు నిజామాబాద్ జిల్లా మాల మహానాడు నాయకులు గైని గంగారాం, టీఎన్జీవో అధ్యక్షుడు అలుక కిషన్, మేయర్ దండు నీతుకిరణ్, అంగారి ప్రదీప్, జిల్లా అధ్యక్షులు చిట్టేటి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాజు, దుబ్బ దళిత సంఘాలు, పాముల బస్తీ దళిత సంఘాలు, కోటగల్లి దళిత సంఘాలు, పోచమ్మ గల్లి దళిత సంఘాలు, కంఠేశ్వర్ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

10 ఎకరాల వరకు రైతుభరోసా అందజేయాలి

- ప్రత్యేక మహాజనసభలో రైతులు

నవతెలంగాణ-మోపాల్

10 ఎకరాల వరకు రైతుభరోసా అందజేయాలని పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని బోర్గం (పి) గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం రైతు భరోసా పథకంపై పలు సూచనలు సలహాల కోసం ప్రత్యేక మహాజన సభను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశానుసారం ముఖ్యఅతిథిగా డిసిఒ ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం కోసం సలహాలు సూచనలు చేయాలని వారిని కోరారు. దీంతో సమావేశానికి హాజరైన పలువురు రైతులు మాట్లాడుతూ.. తప్పకుండా 10 ఎకరాల వరకు రైతుభరోసాను అందజేయాలని అన్నారు. వ్యవసాయం నిమిత్తం ఐటి కట్టే వారికి కూడా మినహాయింపు ఇవ్వాలని, దానివల్ల చాలామంది రైతులు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. అలాగే రూ.7500 రైతు భరోసా కింద అందజేయాలని కోరారు. అలాగే కౌలు రైతులకూ రైతు భరోసా అందే విధంగా చూడాలని కొందరు రైతులు డిసిఒ దృష్టికి తీసుకువచ్చారు. తొలిసారి సొసైటీకి వచ్చిన సందర్భంగా డిసిఓను చైర్మన్, డైరెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హీరా, ఎఈఓ చక్రపాణి, మాజీ విండో చైర్మన్ సూర్యరెడ్డి, డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, సాయిబాబా, రైతులు చిట్టి సాయిరెడ్డి, రఘు పటేల్, సీఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీసీఓను సన్మానిస్తు్న డైరెక్టర్లు

డి.శ్రీనివాస్‌కు నివాళి..

మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షులు డి.శ్రీనివాస్ మృతి చెందడంతో సమావేశానికి ముందుగా ఆయన మౌనం పాటించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత డి.శ్రీనివాస్ అని కొనియాడారు. బోర్గాం సొసైటీ అభివృద్ధిలో ఆయన తోడ్పాటు మర్చిపోలేనిదని అన్నారు. తనలాంటి ఎంతోమంది నాయకులను రాజకీయాలకు తీసుకొచ్చి ప్రోత్సహించిన మహనీయుడని కొనియాడారు. అలాగే ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని తెలిపారు.

రిటైర్డ్ లెక్చరర్‌కు సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న చరిత్ర సబ్జెక్టు లెక్చరర్ సాయిలును శనివారం సాయంత్రం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ విద్యా వ్యవస్థలో అధ్యాపకుడు సాయిలు వృత్తి నిబద్ధతతో చరిత్ర సబ్జెక్టు బోధిస్తూ 100కు 99 మార్కులు సాధించేలా విద్యాబోధన చేశాడని అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో ఇలాంటి అధ్యాపకులు అరుదుగా ఉంటారని ఆయన సేవలు మరువలేనివని అన్నారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ నుస్రత్ జహాన్ సైతం రిటైర్డ్ అయిన లెక్చరర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నరసయ్య, ఇతర యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, బండారి భాస్కర్, సీనియర్ అధ్యాపకులు రాజేశ్వర్, లావణ్య, శైలజ, జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ అజ్మల్ ఖాన్, యకీనుద్దీన్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ లెక్చరర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ తెలిపారు. వేల్పూర్ మండలం జాన్కంపేట్ కారోబార్ పుట్టినరోజు సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను స్థానిక ఎంఈఓ, తొర్లికొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అన్ని దానాలకన్నా విద్యా దానం మిన్న అని అంటూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉత్తములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాన్కంపేట్ మాజీ ఎంపీటీసీ సత్యం రెడ్డి, వీడీసీ ప్రెసిడెంట్ వెంకన్న, కోశాధికారి లింగారెడ్డి, టీచర్ లలిత, మనోజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- బోధన్ కోర్టు జడ్జి సాయి శివ



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి

నవతెలంగాణ-ఎడపల్లి

చట్టాలపై బాలికలకు అవగాహన కలిగి ఉండాలని బోధన్ కోర్టు జడ్జి సాయి శివ అన్నారు. తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో శనివారం చట్టాలపైన అవగాహన కల్పించారు. బాలికలు చదువుతోపాటు క్రీడా రంగాల్లో ధైర్యంగా ముందుకుసాగాలని ఆయన మనోధైర్యాన్ని నింపారు. విద్యార్థులు చరిత్రపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పుస్తకాలను తప్పకుండా చదివి రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను చక్కగా విని బాగా చదువుకొని పాఠశాలకు, కళాశాలకు, తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలోని ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ బాలికల పట్ల ప్రత్యేకత తీసుకోవడం పట్ల ఆయన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎసిపి శ్రీనివాస్, బోధన్ రూరల్ సిఐ నరేష్, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి, పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి, ఉపాధ్యాయులు, నాగలక్ష్మి శంకర్ గౌడ్, ఉపాధ్యాయ బృందంతో పాటు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతుల సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ సింగిల్ విండోలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం కింద రైతులకు పంట సాయం చేసేందుకు నిర్ణయించిందని, దీనిలో రైతుబంధు (రైతుభరోసా)లో మార్పులు చేయుటకు రైతుల సూచనలను ప్రభుత్వం కోరుతుందని, ఈ సూచనల కొరకు కలిగోట్ రైతువేదికలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని వివరించారు. సమావేశానికి రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి జిల్లా సహకార అధికారి, సంఘం అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, మండల వ్యవసాయాధికారి పాల్గొంటున్నారని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన తైబజార్ వేలం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం పట్టణానికి సంబంధించిన రోజువారి, వారాంతపు తైబజార్ వేలంపాట ప్రశాంతంగా ముగిసింది. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సమక్షంలో తైబజార్ వేలంపాట నిర్వహించగా పట్టణానికి చెందిన రాములు రోజువారి తైబజార్ కు 4 లక్షల 5 వేల రూపాయలకు, వారాంతపు తైబజార్ కు సిద్దేష్ 5 లక్షల 70 వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే మార్చ్ నెల వరకు ఉంటుందన్నారు. గ్రామపంచాయతీ నిర్దేశించిన ధరల ప్రకారమే రుసుము వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేయవద్దని తైబజార్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, పట్టణ మాజీ సర్పంచ్ తునికి వేణు, గ్రామపంచాయతీ సీనియర్ అసిస్టెంట్ సిద్ధి రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాల పునఃప్రారంభం

- నేడే విద్యార్థులు చేరుకోవాలి : ప్రిన్సిపాల్

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని జవహార్‌లాల్ నవోదయ విద్యాలయం జూలై 1 నుండి పునఃప్రారంభం కానుంది. కావున విద్యార్థులు అందరూ కూడా ఆదివారం సాయంత్రం వరకు పాఠశాలకు చేరుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అందరూ కూడా ఆలస్యం చేయ్యకుండా త్వరగా పాఠశాలకు చేరుకోవాలని, విద్య బోధన త్వరగా ప్రారంభించనున్నట్టు తెలిపారు.




జవహార్ నవోదయ విద్యాలయం

స్థానిక సమరం ఎప్పుడో..?

- జులై 4తో ముగియనున్న జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీ కాలం
- ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన
- ఆశవాహులకు తప్పని ఎదురుచూపులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆశవాహులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోగా, జులై 4తో మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవీకాలం ముగియనుంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికల తంతును ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, అంతలోనే పార్లమెంట్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువడడం ఈప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పట్టింది. పంచాయతీలకు గడిసిన జనవరిలోనే ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అలాగే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కూడా ఇప్పటికే ఎన్నికలు నిర్వహించి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ పదవీకాలం ముగిసిపోగానే వారి స్థానంలో కొత్త ప్రజాప్రతినిధులకు బాధ్యతలను అప్పగించాల్సి ఉంది. కుల గణన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రిజర్వేషన్లలో మార్పులు చేయాలని యోచిస్తోంది. ఈ లెక్కన స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాగె అవకాశం కనిపించడం లేదు.



మండల, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేక అధికారులు.?

మండలంలో 25 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. 2019 స్థానిక సంస్థలు లెక్కల ప్రకారం మండలంలో 6 ఎంపీటీసీలు, 1 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వీరి పదవీకాలం జులై4తో ముగిసిపోనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవీకాలం ముగింపులోపు ఎన్నిక్షలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించకపోతే మండల, జిల్లా పరిషత్‌లకు కూడా ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం కనిపిస్తుంది. స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి. ప్రత్యేక అధికారుల పాలనతో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టైం ప్రకారం ఎన్నికలు నిర్వహించినట్లుగా స్థానిక సంస్థలకు సమయానుగుణంగానే ఎన్నికల తంతు పూర్తి చేయాలి. చట్టసభలకు ఒకలాగా, స్థానిక సంస్థలకు మరోలా ఎన్నికల తంతును నిర్వహించడం సరికాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమన్వయం చేసుకొని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.

జోరువాన.. ఆనందంలో రైతన్నలు



మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

జూన్ నెల మొదటి వారం నుండి వరుణుడి కోసం ఎదురుచూస్తున్న రైతన్నకు జూన్ చివరి వారంలో వరణుడు కరుణించాడు. శనివారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీగా వర్షం కురిసింది. గత 20 రోజుల నుండి పొలాల్లో దుక్కులు దున్ని నారువేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నకు శనివారం కొద్దిగా ఊరట లభించినట్టయింది. వర్షాలు పడతాయా లేదా అసలేంటి పరిస్థితి ఖరీఫ్ సీజన్ అనుకూలించేనా లేదా అనే అయోమయ పరిస్థితిలో అన్నదాత విలవిలలాడిపోయారు. శనివారం రోజు వాతావరణంలో మార్పు వచ్చి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వీధులను జలమయమయ్యాయి. ఇక వర్షాకాలం అయినట్లే అని నాట్లు వేయడానికి రైతులంతా సిద్ధమయ్యారు.

కొడుకును చంపిన తండ్రి

- ఆస్తి విషయంలో గొడవలు



కాలువ వద్ద సాయిలు మృతదేహం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆస్తి తగాదాల్లో తండ్రి కొడుకుల మధ్య జరిగిన ఘర్షణలో కొడుకు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గండి మాసంపేట్ గ్రామానికి చెందిన వెంకటేశం తన కొడుకు సాయిలు(40)తో ఆస్తి విషయంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి సైతం మద్యం మత్తులో ఇరువురు గొడవపడ్డారు. పరస్పరందాడి చేసుకోగా.. ఈ దాడిలో సాయిలు మృతిచెందాడు. ఎవరికి అనుమానం రాకుండా వెంకటేశం తన కొడుకు మృత దేహాన్ని ఇంటి ఎదురుగా ఉన్న కాలువలో పడేశాడు. అటుగా వెళ్లిన స్థానికులు కాలువలో మృతదేహం గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



జాగిలాలతో పోలీసుల పరిశీలన

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని మంజీర పరివాహక ప్రాంతం నుండి షట్లూర్, ఖత్గాం, వుల్కల్ గ్రామాలకు చెందిన కొందరు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా బిచ్కుంద స్థానికులు ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని బాన్సువాడ డిఎస్పి సత్య నారాయణకు సమాచారం అందించారు. పోలీసులు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించారు.



ట్రాక్టర్‌లను పట్టుకున్న గ్రామస్తులు

తమ ముందునుంచి వెళ్తున్నా పట్టని పోలీసులు

బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఎస్సై మోహన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నెంబర్ ప్లేట్ లేని సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే సమయంలో అనుమతులు లేకుండా నంబర్ ప్లేట్లు లేని ఇసుక ట్రాక్టర్లు పక్కనుండి వెళ్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచిన్న సమస్యలు ఉన్న ద్విచక్ర వాహనాలను పట్టుకొని ఫైన్లు వేస్తున్న పోలీసులు పక్కనుండే అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా లక్షల విలువైన ఇసుక తరలుతున్న పట్టించుకోకపోవడంతో పోలీసుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కనుసనల్లోనే ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనించిన స్థానికులు వెంటనే అనుమతులు లేకుండా వే బిళ్ళులు లేని ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని బాన్సువాడ డిఎస్పి సత్యనారాయణకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి స్థానికులు పట్టుకున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న ఏడు ఇసుక ట్రాక్టర్ల పై పోలీసులు కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం బిచ్కుంద తహసిల్దార్ కు అప్పచెప్పారు. బిచ్కుంద తహసిల్దార్ సురేష్ వాల్టా చట్టం ప్రకారం ప్రతి ట్రాక్టర్ కు ఐదు వేల రూపాయల చొప్పున జరిమానా విధించి ట్రాక్టర్ల పై విధించిన జరిమానా డబ్బులు ప్రభుత్వ ఖజానాలో జమ చేయనున్నట్టు తహసిల్దార్ తెలిపారు.

ఇసుక టిప్పర్‌కు రూ.50 వేల జరిమానా

నవతెలంగాణ-బిచ్కుంద

మంజీర పరివాహక ప్రాంతమైన బీర్కూరు ఇసుక క్వారీ నుండి వే బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ను బిచ్కుంద గ్రామ శివారులో తహసిల్దార్ సురేష్ పట్టుకొని 50 వేల జరిమానా విధించారు. వే బిల్లులు లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తే జరిమానాతో పాటు వాహనంపై కేసు నమోదు చేసి వాహనాల యజమానులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. చెక్ పోస్టు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు.



కుత్బుల్లాపూర్ ఇన్చార్జిని కలిసిన నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కూన హనుమంత్ రెడ్డి ని శనివారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన శ్రీ కాలభైరవ స్వామి, శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ సందర్శనార్థం ఆహ్వానించారు.

10 ఎకరాలలోపు రైతులకే రైతు భరోసా అందించాలి



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్

పది ఎకరాల లోపు రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పథకాన్ని అమలు చేసి వెంటనే డబ్బులను రైతుల ఖాతాలలో జమ చేయాలని మండలంలోని అన్ని గ్రామాల రైతులు తీర్మానం చేశారు. శనివారం రైతు భరోసా పథకం పై రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకునేందుకు సికింద్రాబాద్ నుండి వచ్చిన కో-ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్టర్ వెంకట్ రెడ్డి బృంద సభ్యులకు రైతులు వివరించారు. ఈ సందర్భంగా మండలంలోని భిక్కనూర్, బస్వాపూర్, రామేశ్వర్ పల్లి, తిప్పాపూర్ సింగిల్ విండో సొసైటీ కార్యాలయాల ఆవరణలో ఆయా గ్రామాల రైతులతో ప్రత్యేక బృంద సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ రమేష్, సొసైటీ చైర్మన్లు భూమయ్య, భూమి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు చంద్రకాంత్ రెడ్డి, సాయి రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని రాధ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినోద్, రజిత, సొసైటీ వైస్ చైర్మన్ లు, సొసైటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (అటానమస్) పని చేయడానికి అతిథి అధ్యాపక పోస్టుల కోసం ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు ఉన్నవారు అర్హులని నెట్, సెట్, పీహెచ్‌డి వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. గెస్ట్ లెక్చరర్ తెలుగులో రెండు పోస్టులు, ఆంగ్లంలో రెండు పోస్టులు, గణితశాస్త్రం ఒక పోస్టు, కంప్యూటర్ సైన్స్ ఒక పోస్టు మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారం పూరించి విద్యార్హత సర్టిఫికెట్లు జత చేసి దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాలని తెలిపారు. ఇంటర్వ్యూ, డెమో బుధవారం జులై 3న ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి

- డీఇవోకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని శనివారం టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్నారని ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదని తెలిపారు. అలాంటి జర్నలిస్టులకు యాజమాన్యాలు ఎలాంటి వేతనాలు చెల్లించడం లేదని, జర్నలిస్టుల పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతుండగా వారికి ఫీజులు చెల్లించడం ఇబ్బందిగా ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ అధికారి ప్రైవేట్ పాఠశాలల్లో యజమాన్యాలతో మాట్లాడి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతంపై రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా కన్వీనర్ కృష్ణమాచారి, కో కన్వీనర్లు కృష్ణమూర్తి, వేణు, మోహన్, ప్రవీణ్ గౌడ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు

బాలుడికి రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రానికి చెందిన ఎండి అప్నాన్ (14) గుండెలో రంధ్రం కారణంగా ఆపరేషన్ నిమిత్తమై ములుగులో గల ఆర్వీఎం వైద్యశాలలో రక్తం అవసరం కావడంతో పట్టణ కేంద్రానికి చెందిన రాకేష్ మానవతా దృక్పథంతో స్పందించి అక్కడికి వెళ్లి రక్తదానం చేసినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ డాక్టర్ బాలు తెలిపారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రాకేష్‌కు ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్నల తరపున అభినందనలు తెలియజేశారు.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి సరుకులు, నగదు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన సుద్దాల చిన్న సాయిలు, రెడ్డిపేట బాలరాజు ఇటీవల కాలంలో మరణించగా, బాధిత కుటుంబాలను పరామర్శించి కామారెడ్డి నియోజకవర్గ రామారెడ్డి మండల ఇన్చార్జ్ అధ్యక్షులు మద్దికుంట నర్సాగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సల్మాన్ 25 కిలోల బియ్యం, రూ 2000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న గంగారెడ్డి, దయానంద్, కూడెల్లి ఎల్లం, షాదుల్లా, లక్ష్మణ్, కుమ్మరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నల్లాల సర్వే పూర్తి

- క్షేత్రస్థాయిలో ఇంటింటా పర్యటన
- మండలంలో 10,846కు 9047 ఇండ్లల్లో సర్వే పూర్తి

నవతెలంగాణ-నిజాంసాగర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి శుద్ధ జలం అందించే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. అయితే పథకం ప్రారంభం బాగానే ఉన్నప్పటికీ అమలులో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఐదు సంవత్సరాలలో భగీరథలో ఉన్న బాధలు గమనించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అధికారంలోకి రాగానే పథకం పరిస్థితి కోసం ప్రత్యేక సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా మండలం మొత్తంలో 10846 గృహాలు ఉండగా అధికారులు ఇప్పటివరకు 9047 (83.41)శాతం సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40వేల కోట్లకుపైగా వ్యయంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో సరిగా అమలు కాకపోవడంతో ఇంటింటికి నీరు అనేది 100శాతం పూర్తికాలేదు. దీని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం భగీరథ సమగ్రతను పెంచడానికి ప్రత్యేక సర్వే చేపట్టడానికి నిర్ణయించింది. దీనిని జిల్లా పంచాయతీ అధికారులకు అప్పగించడంతో వారు మండల పంచాయతీ అధికారులకు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా సర్వే చేయించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లిన సభ్యులు ఇంట్లో సభ్యులు ఎంతమంది అనే దానితోపాటు యజమాని వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంటికి నల్ల కనెక్షన్ ఉంటే దాని పరిస్థితితో పాటు నల్ల ఫోటో, నల్ల తో కూడిన యజమాని ఫోటో దించి ప్రత్యేకమైన అప్లికేషన్ నమోదు చేస్తున్నారు. దీంతో భగీరథ పరిస్థితి తెలిసి సమగ్రత పెరిగే అవకాశం ఉంది. గృహాలవారీగా చేపట్టిన మిషన్ భగీరథ సర్వే పూర్తి అయినట్టు అధికారులు తెలిపారు.



సర్వే మొత్తం పూర్తి

మండల పంచాయతీ అధికారి యాదగిరి

మిషన్ భగీరథ పథకం పరిస్థితి గురించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే 83.41 శాతం పూర్తి అయిపోయింది. ఇందులో నల్ల పరిస్థితి కుటుంబ వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నం నల్ల కనెక్షన్ ఉంటే ఫోటో అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నం. సర్వే మొత్తం కూడా వేగంగా పూర్తి అయిపోయింది. మిగతావారు అందుబాటులో లేకపోవడం వలన కొందరు వలస వెళ్లడం వలన వారి గృహాలలో సర్వే పూర్తికాలేదు. సర్వేలో ఏటువంటి తప్పులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించాము.



డీఎస్‌కు హరియాణ గవర్నర్ ప్రగాఢ సంతాపం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజ్యసభ మాజీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షులు మృతి పట్ల హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ధర్మపురి శ్రీనివాస్ గొప్ప రాజకీయ అనుభవం కలిగిన పరిపక్వమైన నాయకులని, కష్ట సమయాల్లో కూడా మంచి నిర్ణయాలు తీసుకునే శక్తి సామర్థ్యం ఉన్న నేత అని, వారు వెనుకబడి వర్గాల నుంచి వచ్చి అంచలంచలుగా రాజకీయాల్లో ఎదిగారని, తనకు వారు అత్యంత ఆత్మీయమైన మిత్రులని దత్తాత్రేయ వారితో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. తాను రైల్వే శాఖ సహాయ మంత్రిగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు విచ్చేసి నిజామాబాద్ అభివృద్ధి కోసం మంచి సలహాలు, సూచనలు అందించారని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా సలహాలు ఇచ్చేవారని, వారి మృతి దేశ రాజకీయాలకు, ప్రత్యేకించి తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని, వారి మృతి వల్ల తెలంగాణ ఒక పాత తరం నాయకున్ని కోల్పోయిందని, దత్తాత్రేయ పేర్కొన్నారు. ధర్మపురి శ్రీనివాస్ ఆత్మకు శాంతిని చేకూర్చాలని ప్రార్థిస్తున్నట్టు బండారు దత్తాత్రయ తెలిపారు.

ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఎడపల్లి

ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల మండలంలోని కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మంచి పేరున్న వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలోని పిసిసి అధ్యక్ష పదవి, మంత్రి పదవులు అధిరోహించి ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలలో చిరకాలస్థాయి పేరు ప్రతిష్టలు సంపాదించారని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, రజిత ఎల్లయ్య యాదవ్, బోధన్ సిడిసి చైర్మన్, ఎడపల్లి మాజీ సర్పంచ్, శంకర్ నాయుడు, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పొల మల్యారెడ్డి, డిసిసి డెలిగేట్ యాసాడ రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ కేత్ మండల అధ్యక్షులు శివరామ ప్రసాద్, ఐరండ్ల నవీన్, రత్నాకర్‌రెడ్డి, మస్యూరి గంగాధర్, మైదం ప్రతాప్‌రెడ్డి, ఆర్.స్వామిగౌడ్, పి.గోపి, మస్తాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చివేత



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం నుంచి మోర్తాడ్ వెళ్లే 64వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలను శనివారం పూడ్చివేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996-97 బ్యాచ్ సభ్యులు కొందరు కలిసి మోర్తాడ్‌కు వెళ్లే జాతీయ రహదారిపై పలుచోట్ల ఏర్పడ్డ పెద్దపెద్ద గుంతలను పుడ్చారు. ఈ గుంతల మూలంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో ప్రమాదాలను నివారించాలన్న సదుద్దేశంతో మిక్స్ చేసిన డాంబర్‌ను ఆటోలో తీసుకెళ్లి గుంతలు పూడ్చివేశారు. ప్రమాదాలను అరికట్టేందుకు జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చిన 1996-97 బ్యాచ్ సభ్యులు గ్రామస్తులు, పలువురు వాహనదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మనాల మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని మెండోరా గ్రామంలో కంఠం బాలకృష్ణ కుటుంబాన్ని, కంఠం భూపతి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం భీంగల్ మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన సేవ్వ స్వప్న కుటుంబాన్ని పరామర్శించారు. ఇరువురి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శవపేటిక అందజేత



శవపేటికను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు 'బాడీ గ్రీజర్' శవపేటికను క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అమూల్యమైనవని వాటిని విస్తరించేందుకు క్లబ్ తరుపున ఉత్తమ సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు లింగం, సెక్రటరీ గంగారెడ్డి, కోశాధికారి నరేష్, మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చాకు లింగం, సిద్ద రమేష్, లోక నర్సయ్య, ఏలేటి రాములు, శంకర్, కమిటీ సభ్యులు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నాయకుడు

- కాలువలో పడిన వ్యక్తిని కాపాడిన సాయిలు



కాలువలో పడిన వ్యక్తిని పైకి ఎక్కిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సోక్కుల సాయిలు సాటి మనిషిని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. బోధన్ పట్టణంలోని మురికి కాలువలో పడి కొట్టుమిట్టాడుతున్న సాటి మనిషిని చూసి మనస్సు చలించి వెంటనే అతన్ని కాపాడడానికి మురికి కాలువలోకి దిగి అతడిని ఒడ్డుకు చేర్చారు. మురికి కాలువలో పడి కొట్టుమిట్టాడుతున్న యువకుడిని ప్రధాన రహదారి వెంబడి వెళుతున్న జనాలు చూసీచూడనట్లు ప్రవర్తించగా ఆయన మురికి కాలువలోకి దిగి ఆయనను కాపాడారు. సాటి మనిషిపై మానవత్వం చాటిన కాంగ్రెస్ నాయకులు సాయిలును పలువురు అభినందించారు.

సీజ్ చేసిన ఇసుక జాతీయ రహదారుల పనులకు..

- తహసీల్దార్ శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో ఇటీవల సీజ్ చేసిన సుమారు 1000 ట్రాక్టర్ల ఇసుకను సంబంధిత అధికారులు ఆదేశాల మేరకు జాతీయ రహదారి పనులకు కేటాయించినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. వాల్టా చట్టం ప్రకారం సీజ్ చేసిన ఇసుకను జాతీయ రహదారి పనులకు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో బ్లూడే సెలబ్రేషన్స్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు బ్లూ డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ బ్లూ కలర్ డ్రెస్‌లో వివిధ రకాల నీలిరంగు వస్తువులను తీసుకు వచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులందరూ బ్లూ కలర్ డ్రెస్‌లలో రావడం ఎంతగానో అలరించింది. ముఖ్యంగా బ్లూ కలర్ చార్ట్‌తో వివిధ రకాల ఆర్ట్ క్రాఫ్ట్ వస్తువులను తయారుచేసి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ప్రతి శని వారం ఓ ఆక్టివిటీ ఉంటుందని దాని గురించి విద్యార్థు లు చక్కగా తెలుసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహి స్తామని తెలిపారు. అందులో భాగంగానే బ్లూ కలర్ డే సెలబ్రేషన్ నిర్వహించామని ప్రతి బ్లూ కలర్ వస్తువుల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థు లు, పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-బోధన్

మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పీఆర్సి బకాయిలను, మేడే కానుకలను తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రావలసిన పీఆర్సి వేతన బకాయిలను చెల్లించాలని, మేడే కానుక బకాయిలను చెల్లించాలని, ప్రతి నెలా వేతనాలను చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు పనిముట్లను ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. పీఆర్సి బకాయిలను రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలలో అన్నీ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు పెరిగిన పి.ఆర్.సి జీతాలను చెల్లిస్తూ, బకాయిలను (ఏరియర్స్) కూడా చెల్లించారని, కానీ బోధన్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇప్పటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన పీఆర్సి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మేడే కానుకను కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కార్మికుల జీతాలను నెలనెలా బకాయిలు లేకుండా ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోవడంతో వారి సొంత డబ్బులతో కార్మికులు చీపుర్లను కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్‌తో చర్చలు జరుపగా కమిషనర్ వేతనాలు మే నెల వరకు చెల్లిస్తున్నామని, జూన్ నెల వేతనం మాత్రమే బకాయి ఉంటుందని తెలిపారన్నారు. డబ్బులు జమ కాగానే అది కూడా చెల్లిస్తామని, పిఆర్‌సి బకాయిలను కూడా ఇస్తామని, పనిముట్లను కార్మికులు కొనుక్కోకుండా మున్సిపాలిటీ నుంచే కొనుగోలు చేసి ఇస్తామని తెలిపారని వివరించారు. మిగతా సమస్యలను కూడా పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ నాయకులు ఈర్షద్, మోహన్, మున్సిపల్ కార్మిక నాయకులు గంగామణి, పోశెట్టి, అబ్బయ్య, భూమయ్య, సాయిలు, రాజు, సాయవ్వ, పోశవ్వ లక్ష్మి, రాజు, శంకర్, గంగారాం కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆత్రేయ పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

అనుమతులకు విరుద్ధంగా నడిపిస్తున్న ఆత్రేయ స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌ఎస్) డివిజన్ కార్యదర్శి మాదరి నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్రేయ స్కూల్ యాజమాన్యం అకాడమీ, సైనిక్ స్కూల్, ట్యూషన్, ఆత్రేయ ఇనిస్టిట్యూట్, కోచింగ్ సెంటర్ అంటూ ఇష్టానుసారంగా బోర్డు ఏర్పాటు చేసి తల్లిదండ్రుల దగ్గర విచ్చలవిడిగా డబ్బులు వసులు చేస్తున్నారని ఆరోపించారు. చదువుకోవడానికి వచ్చే పిల్లలతో పనులు చేయిస్తున్నారని, తక్షణమే ఆత్రేయ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం అందుకున్న తడపాకల్ విద్యార్థిని



బహుమతిని అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

వసుంధర విజ్ఞాన మండలి పెద్దపల్లి వారు ఏప్రిల్ నెలలో పర్యావరణం అనే అంశంపై రాష్ట్రస్థాయిలో కవిత పోటీలు నిర్వహించగా.. తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదవుతున్న మహమ్మద్ రింషాకు మొదటి బహుమతి లభించిందని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. పోటీల్లో పాల్గొన్నందుకు బహుమతిని, వెయ్యి రూపాయల నగదు, మెమోంటోను నిర్వాహకులు పంపగా వాటిని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్ శనివారం విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలకు అనేక సేవలందించి, పాఠశాల మంచిపేరు తెస్తూ.. గత కొన్ని రోజుల క్రితం బదిలీపై ఏర్గట్ల పాఠశాలకు వెళ్ళిన తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, కృష్ణప్రసాద్, గంగాధర్, నవీన్, ఆనంద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మూడవసారి తైబజార్ వేలంపాట వాయిదా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన తైబజార్ వేలంపాట నిర్వహించారు. గ్రామంలో 2024-25 సంవత్సరానికి గానూ తైబజార్ వేలంపాట నిర్వహించగా నిర్దేశించిన రూ.2లక్షల 88వేల టార్గెట్ రాకపోవడంతో ఈనెల జులై 1వ తేదీకి వేలం పాటను వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు. గురువారం నిర్వహించిన వేలంపాటలో రూ.లక్ష మాత్రమే వేలంపాట రావడం మూలంగా వాయిదా వేయగా, రెండవసారి శుక్రవారం నిర్మించిన వేలంపాటలో కూడా అంతే మొత్తం కంటే ఎక్కువగా ఎవరూ పాట పాడకపోవడంతో వాయిదా పడింది. ముచ్చటగా శనివారం మూడోసారి వేలంపాటను నిర్వహించగా మొదటి రోజు కంటే రూ.5వేలు ఎక్కువగా రూ.లక్ష 5వేలను గ్రామానికి చెందిన కుక్కునూరు నరేష్ వేలం పాట పాడారు. అయితే నిర్దేశిత లక్ష్యానికి వేలంపాట రాకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్టు ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మరో మారు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించి ఖరారు చేస్తామని ఆయన తెలిపారు. ఆసక్తిగలవారు సకాలంలో హాజరై నిబంధనల మేరకు టెండర్‌లో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వేలం పాటలో పాల్గొన్న పలువురు

10ఎకరాల వరకు రైతుబంధు అమలు చేయాలి



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

10 ఎకరాలు కలిగి ఉన్న రైతులకు రైతుబంధు పథకం అమలు చేయాలని, నాలా భూములు, చెరువులు, సాగులేని భూములకు రైతుబంధు అవసరం లేదని రైతులు తెలిపారు. ఆదాయ పన్నులకు సంబంధం లేకుండా రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని, ప్రతి సీజన్‌లో జూన్10 లోపు, నవంబర్ 15లోపు రైతుబంధు అందే విధంగా చూడాలని రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్, ఖిల్లా డిచ్‌పల్లి సహకార సంఘాల ప్రత్యేక మహాజన సభ, ప్రభుత్వం రైతుబంధు పథకం అమలుపై రైతులతో సలహాలు, సూచనల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు. సహకార సొసైటీల పరిధిలోని రైతులు పాల్గొని రైతుబంధు పథకంపై రైతుల నుండి పలు అభిప్రాయాలు సేకరించి మహాజన సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదికను అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ వివరించారు. రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారని, ప్రతి సీజన్ జూన్ 10లోపు, నవంబర్ 15 లోపు రైతులకు రైతుబంధు అందే విధంగా చూడాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రాంబాబు, మండల విస్తరణ అధికారులు భావన, రూపేష్, అశ్రీత, సహకార సొసైటీ సిఈఓ కిషన్, చైర్మన్లు రాంచందర్‌గౌడ్, రామకృష్ణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన బోదాస్ గంగాధర్ గతకొన్ని రోజుల క్రితం తాటిచెట్టు నుంచి పడి మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు బెజ్జారం భాను, కల్లెడ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

'న్యూ క్రిమినల్ లా'పై అవగాహన



మాట్లాడుతున్న సెషన్ జడ్జి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని న్యాయ కళాశాలలో న్యూ క్రిమినల్ లాపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి డాక్టర్ కె.ప్రసన్న రాణి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించగా.. ప్రధాన వక్తగా ఫస్ట్ అడిషనల్ డిస్టిక్, సెషన్ జడ్జ్ నిజామాబాద్ కంక కనకదుర్గ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె న్యూ క్రిమినల్ లా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మూడు క్రిమినల్ గ్లాస్‌పై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. మూడు చట్టాలలో మొదటిది భారతీయ న్యాయ సంహిత, రెండవది భారతీయ నాగరిక సురక్ష సంహిత, మూడవది భారతీయ సాక్ష్య సంహిత మీద విస్తృత సంపూర్ణమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ ఆర్ఎస్ శ్రవణ్ కుమార్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన క్రిమినల్ లాస్‌లో ఉన్న వివిధ కొత్త సెక్షన్లను ఎదురయ్యే సవాళ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.స్రవంతి, డాక్టర్ బి.నాగజ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరు గ్రామాలకు హద్దులు చూపండి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన 'సన్నకారు రైతు సంఘం' సభ్యులు శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్ తహశీల్దార్ పి.శ్రీకాంత్‌కు రెండు గ్రామాలకు సంబంధించిన గ్రామ సరిహద్దులు చూపాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సన్నకారు రైతు సంఘం అధ్యక్షులు టి.సాయన్న మాట్లాడుతూ ముప్కాల్ మండల కేంద్రం పక్క గ్రామమైన బాల్కొండ మండలం బుస్సాపూర్ గ్రామాల మధ్య సరిహద్దు ప్రాంతాలను గుర్తించి ఇరు గ్రామాలకు న్యాయం చేయాలని కోరారు. రెండు గ్రామాల మధ్య "కాళేశ్వరం రివర్స్ పంపింగ్" ఉందని ఈ విషయంలో రెండు గ్రామాల మధ్య సైక్యత లేకపోవడంతో గ్రామాల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంలో హద్దులు చూపుతూ ఇరు గ్రామాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సన్నకారు రైతు సంఘం సభ్యులు నరేష్, దినేష్, మహేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం సభ్యులు

చూడండి సారూ.. సూచిక బోర్డు



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు తలకిందులుగా వేలాడుతోంది. దానిని చూచి ప్రయాణికులు అవాక్కవుతున్నారు. సూచిక బోర్డు తలకిందులుగా ఉండటంతో అక్కడ ఉన్న హోటల్‌లో రూట్లను అడుగుతున్నారు. ఆ సూచిక బోర్డును పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

- మండల నోడల్ అధికారి ఆంజనేయులు

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని మండల నోడల్ అధికారి ఆంజనేయులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవి కాలంలో చిన్నారులకు అందించిన సేవలను కొనియాడారు. మండలంలోని దూపల్లి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణ ఈనెల 30న ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆమెను, ప్రైమరీ పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియూ మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణ, సాయన్న, రాజేశ్వర్, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, శ్రీధర్, గ్రామ పెద్దలు బాబన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అన్నీ సాధ్యం

- జిల్లా జడ్జి కె.సునీత, సీపీ కల్మేశ్వర్
- విద్యార్థులకు 250 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యతోనే అన్నీ సాధ్యమవుతాయని జిల్లా జడ్జి కె.సునీత, సీపీ కల్మేశ్వర్ అన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందజేస్తుందని, చిన్నప్పటి నుండే మంచి విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారు సూచించారు. శనివారం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి కె.సునీత, ప్రత్యేక ఆహ్వానితులుగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెన్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1989-90 సంవత్సరపు పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు 250 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వితరణ చేశారు. వీటితో పాటు వాటర్ ఫిల్టర్లను అందజేశారు. గతేడాది చదివిన 6వ తరగతి నుంచి పదవ తరగతి చదివిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సీతయ్య, నరేష్, ఆనంద్, సాయిలు, ఉపాధ్యాయులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, 1989-90 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న జిల్లా జడ్జి సీపీ



అందజేసిన డిక్షనరీలతో విద్యార్థులు

ఆలయ పేరుమీదనే భూముల పట్టా

- కౌలువేలం పాట వాయిదాలో ఆంతర్యమేమిటో..?



శుక్రవారం భూముల కౌలు వేలంపాటలో పాల్గొన్న పలువురు(ఫైల్)

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూర్ హనుమాన్ టెంపుల్ పేరున రెండు సర్వే నెంబర్లలో మొత్తం 14 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఈ భూమి కూడా రెవిన్యూ రికార్డుల్లో హనుమాన్ టెంపుల్ పేరునా ఉంది. ఈ భూమి హనుమాన్ టెంపుల్ దేవస్థానందేనని గ్రామస్తులు తెలుపుతున్నారు. పెద్ద మొత్తంలో హనుమాన్ టెంపుల్ పేరునగల భూమికి కౌలు వేలంపాట వేయడానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఈనెల 28న మేనూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ గ్రామ పెద్దలు ఎవరో ఆ భూమి కోర్టులో కేసు నడుస్తుండగా మీరు ఆ భూమి ఎలా కౌలు వేలంపాట వేస్తారు అనగానే ఇక్కడ వేలంపాట నిర్వహించడానికి వచ్చిన దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు సరైన సమాధానం చెప్పకుండా పై అధికారుల ఆదేశాల అనుసారం అనివార్య కారణాల వలన వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. దేవస్థానం పేరున పట్టా ఉన్నప్పటికీ ఎవరో వచ్చి ఏదో చెప్పగానే కౌలు వేలంపాట వాయిదా వేయడం ఏమిటని చర్చలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఆయలం పేరున పట్టా ఉన్న భూములకే అధికారులు కౌలు వేలంపాట నిర్వహించడంలో నిర్లక్ష్యం ఏమిటని చర్చ ప్రజల్లో వ్యక్తం అవుతుంది. గ్రామాల్లో దేవస్థానాలకు భూములు ఉన్నాయి. అలాంటి భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి, వాటిని ఎవరు పట్టించుకోవాలని అధికారుల చర్యలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దేవాలయాల భూములు పట్టాదారులకు సొంత భూములుగా మార్చుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దేవాలయాల భూములు కాపాడడంలో ఇటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అటు రెవెన్యూ శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ కృషితోనే 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేశారాని, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది, కొరత ఉందని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలుపగా వెంటనే జిల్లా వైద్య అధికారి విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కారిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు, ఉన్నారు.

వీరన్నగుట్ట పాఠశాల మౌలిక వసతులపై ఆరా

- పాఠశాలను సందర్శించిన ఎంపీటీసీ



సౌకర్యాలను తెలుసుకుంటున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట పాఠశాలలో మౌలిక వసతులపై పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఎంపీటీసీ వీరగంగ లతా భూమేష్ స్పష్టం చేశారు. శనివారం ఎంపీటీసీ పాఠశాలను సందర్శించారు. గత మండల సమావేశాల్లో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అభివృద్ధి పేరుతో పాఠశాల ప్రహరీని ధ్వంసం చేయడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి వస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 300 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కనీస వసతులైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థినిలు నానా అవస్థలు పడుతున్నారని ఆమె అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో వారు సమీపంలోని పాఠశాలను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాల మండలంలోనే పేరు సంపాదించిందని, నేడు వసతులు కరువై విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ పాఠశాలకు పూర్వ వైభవం రావాలంటే, ఉపాధ్యాయులతో పాటు పరిసరాల పరిశుభ్రత మౌలిక వసతుల కల్పన తప్పనిసరిని అని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు గుంపులు గుంపులుగా తమ సెల్‌ఫోన్‌లతో మాట్లాడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అనంతరం ప్రైమరీ పాఠశాల అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి వారికి పలు సూచనలు ఇచ్చారు. స్థానిక నాయకులు భూమేష్, బన్సియా నాయక్, వినోద్, గ్రామ కార్యదర్శి రాజు, ఏలియా, మహబూబ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఎస్ చేసిన సేవలు మరువలేనివి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ మృతదేహాన్ని హైదరాబాద్‌లోని తన నివాసంలో రూరల్ కాంగ్రెస్ నాయకులు శనివారం సందర్శించారు. డి.శ్రీనివాస్ మృతి పట్ల డిసిసి డెలిగేట్ నోముల వెంకట్ రెడ్డి, ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ లారీ కుంట గంగారెడ్డి తోపాటు ఇతర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రం ఒక మంచి నాయకున్ని కోల్పోయిందని వారన్నారు.

సస్పెన్షన్‌లో తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ తైబజార్ వేలం పాటను అధికారులు సస్పెన్షన్‌లో నెట్టేశారు. శనివారం గ్రామపంచాయతీ తైబజార్ వేలం పాటను మండల అభివృద్ధి అధికారి, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కమలాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి గాను తైబజార్ వేలం పాట నిర్వహించగా 5 గురు కాంట్రాక్టర్లు రూ.2 లక్షలు డిపాజిట్ చేసి పాల్గొన్నారు. తై బజార్ పాటకు గ్రామపంచాయతీ సిబ్బంది గత గురువారం నిర్వహించిన వేలం పాటను ప్రామాణికముగా తీసుకొని బాన్సువాడ డివిజనల్ కేంద్రానికి చెందిన నాటుగారి రాజేష్ రూ.8లక్షల 50 వేల పాటతో కొనసాగించగా పంచముఖి పోటీ నెలకొంది. పత్తి హరీష్ రూ.8 లక్షల 88వేలు పాట పాడగా ఆయనపై బాన్సువాడ డివిజనల్ కేంద్రానికి చెందిన నాటకారి రాజేష్ రూ.8లక్షల 89వేలు పాట పాడడంతో మిగిలిన కాంట్రాక్టర్లు ఎవరు ఆయనపై పాట పాడకపోవడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర పలుకనందున ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని వెల్లడించారు. చివరకు ఆఖరి క్షణంలో అత్యధిక పాట పాడిన నాటకారి రాజేష్ పేరును పై అధికారులకు పంపి త్వరలో ఫైనల్ డిసిషన్ తెలుపుతామని స్థానిక అధికారులు సూచించారు. దీంతో తైబజార్ వేలంపాట సందిగ్ధంలో నెలకొంది. మండల పంచాయితీ అధికారి బ్రహ్మం, సెక్రెటరీ యాదగిరి, పలు మండలాల కాంట్రాక్టర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్ని (రుద్రూర్)

మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో గల మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీ ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆలూరు నరేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 2వ తేదీన నేరుగా పాఠశాల, కళాశాలకు విచ్చేయాలని సూచించారు. 9వ తరగతిలో 06 సీట్లు, పదో తరగతిలో 10 సీట్లు ఉన్నాయని, కళాశాలలో సిఈసిలో 15, ఎంపిసిలో 04, బైపిసిలో 03 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు జులై 2న ఉదయం 10:30 పాఠశాలకు విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉద్యోగికి విరమణ తప్పదు

- సీపీ కల్మేశ్వర్
- ఉద్యోగ విరమణ సిబ్బందికి వీడ్కోలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవర్ అన్నారు. నిజామాబాద్ పోలీస్ శాఖలో 40 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారిలో జి.ఎల్లయ్య, ఎస్సై, సిటిసి, నిజామాబాద్ పోలీస్‌శాఖలో 36 సంవత్సరాల సర్వీసు పూర్తి, ఎ.రాములు, ఎఎస్ఐ నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ 40 సంవత్సరాల సర్వీసు పూర్తి, ఎస్.రామ్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ 1334, పోలీస్ కంట్రోల్ రూమ్ 40 సంవత్సరాల సర్వీసు పూర్తి, ఎ.జనార్ధన్‌రావ్, హెడ్ కానిస్టేబుల్ 1401, మహిళా పోలీస్ స్టేషన్, వీరు "ఉద్యోగ విరమణ" చేయనున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి వారికి శాలువాలతో సత్కరించి" ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్టిఫికేటు (జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ..

పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. మీరు డిపార్టుమెంట్‌కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) బి.కోటేశ్వరరావు, సిసిఆర్‌బి, ఎసిపి రవీందర్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.



విరమణ సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ, పోలీసు అధికారులు

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



మాక్లూర్ : మాట్లాడుతున్న జెడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు



ఆర్మూర్ : సమావేశంలో పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-మాక్లూర్/ఆర్మూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ప్రత్యేక మహాజన సభ నిర్వహించి ప్రభుత్వం అందించే రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలను శనివారం ప్రత్యేక అధికారి పాపయ్య సేకరించారు. ఈ సందర్భంగా రైతులంతా అభిప్రాయాలను తెలిపారు. కొందరి రైతులు ఐదు ఎకరాలలోపు రైతులకు ఇవ్వాలని, మరి కొందరు పది ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తెలిపారు. కౌలు రైతులకు కూడా ఇస్తే బాగుంటుందని అన్నారు. వీరి అభిప్రాయాలను తీర్మానం రూపంలో తీసుకొని ఉన్నతాధికారులకు పంపిస్తామని నోడల్ అధికారి తెలిపారు.

నొక్కిన డబ్బును రికవరీ చేయాలి..

అనంతరం డైరెక్టర్లు, సిబ్బంది రైతులకు తెలుపవలసిన లెక్కలపై ప్రశ్నించారు. సుతిలీలకు రూ.10లక్షలు, లారీ డ్రైవర్ బత్తా రూ.7లక్షలు, గోదాంలు నిర్మించకుండానే రూ.34లక్షలు, బంగారం లోన్ కట్టిన డబ్బులు బ్యాంక్‌లో చెల్లించకుండా రూ.9.15లక్షలు ఇలా అనేక విధాలుగా సొసైటీలో అవకతవకలపై రైతులు సిబ్బందిని, డైరెక్టర్లను నిలదీశారు. ఎవ్వరూ కూడా సరైన సమాధానం ఇవ్వలేదు. దీనితో ఎవరు ఎంత నొక్కరో వారి నుంచి రికవరీ చేసి కేసులు పెట్టాలని రైతులు తీర్మానించారు. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ.. ప్రతి రూపాయి రికవరీ చేయాలని నవతెలంగాణలో పత్రికల్లో వచ్చిన కథనాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుర్రోల్ల అశోక్, మాజీ చైర్మన్లు భాస్కర్ రావు, డేగ పోశెట్టి, దయాకర్ రావు, ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, మండల వ్యవసాయాధికారి పద్మ, డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది, సిఇఓ విష్ణువర్ధన్, హెడ్‌క్లార్క్ విజయ్, శ్రీకాంత్, శంకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీలో ఏకగ్రీవ తీర్మానాలు

ఆర్మూర్ : రైతుబంధు అమలు కోసం రైతుల అభిప్రాయాల సేకరణ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆలూర్‌లో ప్రత్యేక మహాజన సభ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎక్కువ మంది రైతులు 5 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతుబంధు అమలు చేయాలని, సాగు భూమి రైతులకు అమలు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ సొసైటీ చైర్మన్ తాంబూర్ శ్రీనివాస్, సొసైటీ వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సొసైటీ డైరెక్టర్ ప్రమోద్‌కుమార్, ఆరే రాజేశ్వర్, కళ్లెం భోజారెడ్డి, బార్ల సంతోష్‌రెడ్డి, సింగేడి మల్లుబాయ్, కళ్లెం సాయిరెడ్డి, వెల్మనర్సారెడ్డి, ఆర్మూర్ వైస్ ఎంపీపీ మోతే చిన్నరెడ్డి, ఆలూరు మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి తొర్తి మల్లేష్, గ్రామరైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

వ్యవసాయ కూలీలకు ప్రత్యేక చట్టం తెచ్చి, ఎన్నికల హామీలో భాగంగా జీవన భృతి అందించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో లక్ష్మణ్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో 59 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, 14 కోట్ల మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారని, రెక్కలు తప్ప ఆస్తులు లేని కూలీలకు సంవత్సరానికి రూ 12,000 దేనికి సరిపోవని, నెలకు జీవన భృతి 2000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్ రమేష్, ఏ ప్రకాష్, జి సురేష్, ఈ రమేష్, బి కిషోర్, ఎస్ కిషోర్, మండల నాయకులు గోపాల్, వెంకట్, రాజు, మధు, మీనా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-రెంజల్

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో 60శాతం మంది కార్మికులు వ్యవసాయ పనులు చేస్తున్నారని వారికి సమగ్రమైన చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.600, 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 ప్రభుత్వం ప్రకటించాలన్నారు.

ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వడమే కాకుండా వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు లక్షల రూపాయల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు పుట్టినడిపి నాగన్న, పార్వతీ రాజేశ్వర్, వడ్డెన్న, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే నసీర్, సంతోష్, సిద్ధ పోశెట్టి, మక్కన్న, హైమద్, జబ్బర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు